క్లుప్తంగా

పండూరు-2 సచివాలయం ప్రారంభం

కాకినాడ రూరల్: మండలంలో పి.వెంకటాపురంలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన నూతన భవనాన్ని కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం జగన్ అందుబాటులోకి తీసుకువచ్చాక పక్కా భవనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, ఉప సర్పంచ్ పెంకే సోమరాజు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న, మండల ఇంజినీర్ వాసుదేవరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: నిత్యం వివిధ రకాల వాతావరణాల మధ్య విధులు నిర్వర్తిస్తూ ధ్వని కాలుష్యానికి గురయ్యే పోలీస్ సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ సూచించారు. శనివారం స్వాతి హియరింగ్ కేర్ సెంటర్ అధినేత శ్రీనునాయక్ ఆధ్వర్యంలో సర్పవరం పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఉచిత ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించారు. సీఐ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మెషీన్లు సిఫార్సు చేయగా క్రితి ఆస్పత్రి ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ గుబ్బల లక్ష్మణప్రసాద్ వారిని పరీక్షించి మందులు అందజేశారు. ఎస్సై మురళీకృష్ణ, ఏఎస్సై ఎం.నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో విగ్రహ శకలాలను తొలగించాలి



తీరానికి వచ్చిన విగ్రహ శకలాలను చూపిస్తున్న రమణరాజు

కాకినాడ రూరల్: సముద్ర తీరంలో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలను జలాల్లోపలికి తరలించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వల్ల విగ్రహ శకలాలు ఒడ్డుకు తరలి వస్తున్నాయని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. శనివారం కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో పర్యటించిన ఆయన అక్కడి పరిస్థితిపై మాట్లాడుతూ సముద్ర తీరాన్ని శుభ్రం అధికారులను కోరారు. బీచ్ పార్క్ నిర్వహణను గాలికి వదిలివేయడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరగడం లేదన్నారు. పీఓపీ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాల తయారీదారుల కుటుంబాలతో కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు

కాకినాడ సిటీ: జిల్లాలోని కళాకారులు గుర్తింపు కార్డుల జారీ నిమిత్తం ఈ నెల 5వ తేదీలోపు తమ వివరాలను పంపాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.నాగార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు నూతన గుర్తింపు కార్డు జారీ చేసేందుకు నిర్ణయించిందన్నారు. కళాకారులు తమ పేరు, పుట్టిన తేదీ, బ్లడ్ గ్రూప్, కళారూపం, ఎన్ని సంవత్సరాల అనుభవం, ఆధార్ నంబర్, అడ్రస్ వివరాలతో ఏ4 సైజ్ కాగితంపై స్పష్టంగా తెలిసే విధంగా నమోదు చేసి కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చన్నారు. ఈ నెల 5వ తేదీలోగా జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలని నాగార్జున స్పష్టం చేశారు.

రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా పితాని



కాకినాడ సిటీ: రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా కాకినాడ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పిఠాపురం తహసీల్దార్ పితాని త్రినాథరావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ ఎన్నికలు నిర్వహించగా ఆయనను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సహాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ రహితంగా స్టేషన్ ఆవరణ

- రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణ అంతా ప్లాస్టిక్ నిషేధ ప్రాంతాలుగా తయారుకావాలని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలలో భాగంగా శనివారం స్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ప్రయాణికులకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి క్లాత్ సంచులను పంపిణీ చేశారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టరు రామకృష్ణ, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఆరోగ్య సురక్ష

- ప్రతి సచివాలయ పరిధిలో శిబిరాలు
- ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పరీక్షలు
- 52 రోజుల పాటు షెడ్యూల్ ఖరారు



వైద్య సేవలకు వచ్చిన పిల్లి లక్ష్మిని పలకరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు. చిత్రంలో ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ రూరల్: ప్రతి కుటుంబం ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా, సంపూర్ణ వైద్యం ప్రతి ఇంటికీ అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు కోసం వైద్య నిపుణులు గ్రామాల బాట పట్టారు. నియోజకవర్గంలో అధికారులు బృందాలుగా ఏర్పడి 52 రోజులకు షెడ్యూల్ రూపొందించారు. కాకినాడ రూరల్‌లో 41, కరప మండలంలో 21 సచివాలయాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఉన్న నాలుగు పీహెచ్‌సీలు సమీపంలో ఉన్న సచివాలయాలు మినహా మిగిలిన 58 సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహించేలా షెడ్యూల్ నిర్ణయించారు. కాకినాడ రూరల్ మండలం పండూరు-2 సచివాలయం పరిధిలో పి.వెంకటాపురం శనివారం కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలో సుమారు 1,65,000 జనాభా ఉండగా 62,123ఇళ్ళు ఉన్నాయి. మండలంలోని 39 సచివాలయాల్లో పని దినాలలో శిబిరాలు నిర్వహించనున్నారు. మండల అభివృద్ధి అధికారి కె.స్వప్న, ఈఓ పీఆర్డీ, టైపిస్ట్ ఒక బృందంగాను, మండల తహసీల్దార్ మురార్జీ, డిప్యూటి తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ ఒక బృందంగా ఏర్పడి ఈ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. నవంబర్ 20 వరకు షెడ్యూల్ ఖరారు చేశారు.



కరపలో నిర్వహించిన శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు

సర్వే, శిబిరాలు ఇలా

సచివాలయం పరిధిలో సురక్ష శిబిరం నిర్వహణకు 21 రోజుల ముందు జేఏఎస్ యాప్ తెరుచుకుంటుంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి పేర్లు నమోదు చేస్తారు. 15 రోజుల ముందు ఆరోగ్య సిబ్బందితో కలసి మళ్లీ వెళ్లి ఆరోగ్య సంబంధ సమాచారం సేకరించి, వైద్య పరీక్షలు చేస్తారు. శిబిరం నిర్వహణకు మూడు రోజుల ముందు టోకెన్లు అందించి శిబిరం వివరాలు చెప్తారు. శిబిరంలో హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటరు, కన్సల్టేషన్ కౌంటరు, మందుల కౌంటరు ఉంటాయి. అక్కడే వైద్యులు పరీక్షలు చేస్తారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉంటుంది. అనంతరం మందులతో కూడిన జేఏఎస్ కార్డును రోగులకు అందిస్తారు. మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్యశ్రీ సౌకర్యం ఉన్న ఆస్పత్రులకు పంపుతారు.

ఊళ్లోనే వైద్యం



వైద్యం కోసం పండూరు పీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. జగనన్న సురక్ష ద్వారా మా ఊళ్లోనే డాక్టర్ వైద్యం అందించారు. బీపీ పరీక్షలు చేశారు. మోకాళ్ల నొప్పులకు వైద్యం అందించారు. చాలా సంతోషంగా ఉంది. పేదల వైద్యం కోసం పరితపించే జగనన్న చల్లగా ఉండాలి.

– రాయుడు సూరీడు, పి.వెంకటాపురం

అన్ని సచివాలయాల్లో శిబిరాలు



కాకినాడ రూరల్ మండలంలో పండూరు, తూరంగి గ్రామాల్లో 39 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తాం. వైద్యం అవసరమైన వారు వలంటీర్లు, వైద్య సిబ్బందికి సర్వేలో తెలియజేయండి. నిపుణులైన వైద్యులు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– కర్రె స్వప్న, ఎంపీడీఓ, కాకినాడ రూరల్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ధ్యేయం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కరపలో ఆరోగ్య సురక్ష శిబిరం
- 500 మందికి వైద్య పరీక్షలు

కరప: ప్రతి కుటుంబానికి ఉచితంగా వైద్యసేవలు అందించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను చేయడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల అని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. అందరికీ విద్య, వైద్యం అందించడం ద్వారా ప్రజల జీవనప్రమాణం పెంచడమే ధ్యేయంగా అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నేను ఉన్నాను, నేను విన్నాను అంటూ ప్రతి పేద గుండెను తట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇంటింట సర్వేతో ప్రజలు ఆరోగ్య సమస్యలు తెలుసుకుని శిబిరానికి తీసుకువచ్చి 14 రకాల పరీక్షలు నిర్వహించి, 105 రకాల మందులు అందజేస్తున్నారన్నారు. అవసరమైతే కాకినాడ పెద్దాస్పత్రికి తీసుకెళ్లి తగిన వైద్యం అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు కేస్ షీట్, మందులతో కూడిన కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. జగనన్న కంటివెలుగులో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వి.లక్ష్మి అంగన్‌వాడీల ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్, కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే కన్నబాబు సైతం షుగర్ టెస్ట్ చేయించుకున్నారు. 500 మంది గ్రామస్తులకు మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ నాయక్, పీహెచ్‌సీ వైద్యులు పి.ఆశ, ఈ.సింధూర, ఎంకే సౌజన్య, కాకినాడ నుంచి వచ్చిన వైద్య నిపుణులు వైద్య సేవలందించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓపీఆర్డీ ఎస్‌పీ శ్రీనివాసరావు, గ్రామకార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధికారులు, కార్యదర్శులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పెంకే సత్తిబాబు, గోపిశెట్టి బాబ్జీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కరపలో మహిళకు కేస్ షీట్, మందులతో కూడిన జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

ఇదే ఒరవడిని కొనసాగిద్దాం



కమిషనర్, ఎంహెచ్‌వో, ఈఈలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- దేశంలో రెండోస్థానం గర్వకారణం
- కమిషనర్, ఎంహెచ్‌వో, ఈఈలకు ఎంపీ, ఎమ్మెల్యేల ప్రశంస

కాకినాడ: ఇండియన్ స్మార్ట్‌సిటీ అవార్డ్స్ 2022లో కాకినాడ రెండో స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 28న ఇండోర్‌లో కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌ప్రీత్‌సింగ్ నుంచి అవార్డు అందుకుని తిరిగి వచ్చిన నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌లను శనివారం వారు అభినందించారు. ఎంపీ గీత మాట్లాడుతూ దేశంలోని 100 స్మార్ట్‌సిటీలతో పోటీపడి పారిశుద్ధ్య విభాగంలో(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) రెండో స్థానంలో నిలవడం సాధారణ విషయం కాదన్నారు. ర్యాంక్‌ను సాధించడం ఎంత కష్టమో, వచ్చిన ర్యాంక్‌ను, ప్రతిష్టను నిలబెట్టుకోవడం కూడా ప్రధానమన్నారు. రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలు, సమన్వయం వల్లే కాకినాడ ఉత్తమ స్థానంలో నిలవగలిగిందన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి ఉద్యోగి మరింత కష్టపడి పనిచేయాలని, ఇందుకు తన వంతు తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు. కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ అవార్డు స్వీకరించిన స్ఫూర్తితో ఉద్యోగులంతా మరింత సమన్వయంతో మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేలా కృషి చేస్తామన్నారు. వీరి వెంట ఈఈ మాధవి తదితరులు ఉన్నారు.

బేసిక్ ల్యాబ్‌లకు ఢోకా లేదు

- డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్

కాకినాడ క్రైం: వైద్యుల సూచనలకు అనుగుణంగా వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ రోగుల అనారోగ్య స్థితిగతులను నిర్ధారిస్తున్న ల్యాబొరేటరీల ఉనికిపై ఇటీవల కాలంలో తీవ్ర చర్చ జరుగుతోంది. పాథాలజిస్టులు లేని బేసిక్ లేబ్‌లు ఇకపై మనుగడను కొనసాగించలేవనీ, వాటి అనుమతులు రద్దు చేస్తారని జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. చిన్నపాటి ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్న ఎందరో ఎల్‌టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి ప్రత్యేక బృందాలు వచ్చి ల్యాబ్‌లు తనిఖీలు చేసి పాథాలజిస్టులు ఉన్నారా లేరా అన్న వివరాలు నమోదు చేసుకొని వెళ్లడం వారిని గందరగోళంలోకి నెట్టింది. ఈ తరుణంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఈ అంశంపై వివరణ ఇస్తూ న్యాయస్థానంలో పలువురు పిల్ వేయడంతో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం పాథాలజిస్టులు ఎన్ని ల్యాబ్‌లలో ఉన్నారనే గణాంకాలు సేకరిస్తోందన్నారు. పాథాలజిస్టులు లేని ల్యాబ్‌లను మూసివేస్తారన్న ప్రచారంలో నిజం లేదన్నారు. జిల్లాలో 10 మంది ప్రోగ్రాం ఆఫీసర్ల బృందం, ఎస్‌వో సంయుక్త ఆధ్వర్యంలో ఈ గణాంకాలు కొనసాగుతున్నాయన్నారు. మరో రెండు రోజుల్లో పూర్తి చేసి రాష్ట్ర విభాగానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. జిల్లా మెడికల్ ల్యాబొరేటరీస్ యూనియన్ అధ్యక్షుడు వెంకట్ ఈ అంశంపై స్పందిస్తూ గణాంకాల సేకరణపై ఎల్‌టీలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

ఆర్జేడీకి మట్టి కలశం అందజేత



ఆర్‌జేడీ నాగమణికి మట్టి కలశాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మేరా మిట్టీ.. మేరా దేశ్‌లో భాగంగా కాకినాడలో వివిధ పాఠశాలల నుంచి సేకరించిన మట్టిని ఏఎంవో చామంతి నాగేశ్వరరావు ద్వారా ఆర్‌జేడీ నాగమణికి అందజేశారు. కాకినాడ అర్బన్ ఎంఈవో సీహెచ్ రవి ఆధ్వర్యంలో నగరంలో ఉన్న వివిధ పాఠశాల నుంచి సేకరించిన మట్టిని కలశంలో ఉంచి మట్టిని అందజేశారు. ముందుగా ఉపాధ్యాయులు, హెచ్ఎంలతో అర్బన్ మండల కేంద్రం నుంచి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు.

నైపుణ్యాభివృద్ధికి స్కూల్ కాంప్లెక్సులు

- కాకినాడ డీవైఈఓ రాజు



స్కూల్ కాంప్లెక్స్‌లో కబడ్డీ నైపుణ్యాలు వివరిస్తున్న రిసోర్స్ పర్సన్ పీడీ శ్రీనివాస్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వ్యాయామ విద్యలో నైపుణ్యాభివృద్ధికి స్కూల్ కాంప్లెక్స్ మీటింగులు దోహదం చేస్తాయని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్‌జేడీ రాజు పేర్కొన్నారు. స్థానిక గాంధీ నగర్ మున్సిపల్ స్కూల్‌లో కాకినాడ డివిజన్ ఇన్‌చార్జి, పీడీ పట్టాభి ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి రాజు ముఖ్య అతిథిగా హాజరై షెడ్యూల్‌ని అనుసరించి ఖేలో ఇండియా రిజిస్ట్రేషన్ చేసుకునే విధానంపై రిసోర్స్ పర్సన్ పీడీ శ్రీహరి, కబడ్డీ కౌశలాల నైపుణ్య అభివృద్ధిని రిసోర్స్ పర్సన్ గుడారి గుంట మున్సిపల్ స్కూల్ పీడీ శ్రీనివాస్ వివరించారు. సమావేశాల ఏర్పాటుకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ భానుమూర్తి రాజు చేసిన కృషిని కొనియాడారు.

ఎస్సై మెయిన్ పరీక్ష వాయిదా వేయాలి

కాకినాడ సిటీ: ఎస్ఐ మెయిన్ పరీక్షలను రెండు నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రమణయ్యపేటలో గడపగడపకూ..



పాత గైగోలుపాడులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలను నమ్మవద్దని, వైఎస్సార్‌సీపీది సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శనివారం రమణయ్యపేట సచివాలయం-4 పరిధిలోని పాత గైగోలుపాడులో ఇంటింటికీ పర్యటించి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. రమణయ్యపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి ఆధ్వర్యంలో సచివాలయం, మండల అధికారులతో కలిపి ఇంటింటికీ పర్యటించారు. స్థానికంగా ప్రభుత్వం నుంచి పట్టాలు పొందిన మహిళలు సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబులకు ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో 32 వేల పట్టాలు అందించామని, సీఎం జగన్‌ను, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దవులూరి వెంకటరమణ, డీఎల్‌డీవో నారాయణమూర్తి, గుబ్బల విజయ్, గుబ్బల అప్పారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీజీ జయంతి



ఏఎస్‌డీ కళాశాలలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భామిరెడ్డి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అన్నవరం సత్యదేవి జూనియర్ కళాశాలలో శనివారం గాంధీజయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మూర్తిరాజు అధ్యక్షతన కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి భామిరెడ్డి, విశ్రాంత పీడీ కృష్ణమూర్తి అతిథులుగా విచ్చేశారు. కళాశాల ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అండర్-19 ఎంపికల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి, జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. కర్రిభామిరెడ్డిని కళాశాల తరపున సత్కరించారు.

సీఎం పర్యటనను జయప్రదం చేద్దాం : మున్సిపల్ కమిషనర్



కాకినాడ: నిర్మాణం పూర్తి చేసుకున్న జగనన్న కాలనీలను ప్రారంభించేందుకు అక్టోబర్ 5న జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో కార్పొరేషన్ ప్రత్యేక అధికారులు, నోడల్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, ఆర్పీలతో ఆయన శనివారం సమావేశమయ్యారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు, వసతులతో సామర్లకోట వద్ద జగనన్న కాలనీలను ఈ జిల్లా నుంచే ప్రారంభించనుండడం హర్షణీయమని అన్నారు. సామర్లకోటలో ఈ నెల 5న సీఎం పాల్గొనే సభకు కాకినాడ ప్రాంత గృహనిర్మాణ లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని సూచించారు. ఆ మేరకు ఆయా విభాగాలు సీఎం సభను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కోరారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మెప్మా పీడీ ప్రియంవద, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఆర్పీలు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

కాకినాడ సిటీ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందించారు. నాడు-నేడు ఫేజ్-2లో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణం సంవత్సర కాలంగా కొనసాగుతున్నందున ఆడపిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అదే విధంగా జీవో నంబర్ 117 రద్దు చేయాలని, తరగతుల విలీన ప్రక్రియ నిలిపివేయాలని తదితర 40 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కేఎస్ సుబ్రహ్మణ్యం, ఎన్.ఫిలిప్‌రాజు, గోరస దుర్గాప్రసాద్, నల్లబిల్లి శ్రీనివాస్, రామచంద్రం, సిరాజ్ తదితరులు ఉన్నారు.